క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఏర్పాటు



దాచేపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నారాయణపురంలోని సుబ్బమ్మ హోటల్ పక్కన ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కార్యాలయంలో సమన్వయకర్త కోసం ప్రత్యేక గదితో పాటు కార్యకర్తలు, నాయకుల సమావేశాలకు ఒక హాల్‌ను కూడా ఏర్పాటు చేశారు. దాచేపల్లి నగర పంచాయతీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని కార్యకర్తలందరూ ఇక్కడ కార్యాలయానికి వచ్చి పార్టీ పటిష్టత కోసం చర్చించుకునేందుకు వీలుగా అన్ని వసతులను సమకూర్చారు. నూతన కార్యాలయం ఏర్పాటుపై కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో ఈ నెల 6 తేదీ నుంచి 31 వరకు రెవెన్యూ సదస్సులను పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.నగేష్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహిస్తున్న ఈ సదస్సులను ఆయా గ్రామస్తులు సద్వినియోగం చేసుకుని వారికి సంబంధించిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. 6వ తేదీన మల్లవరం, 10న జెట్టిపాలెం, 12న పశర్లపాడు, 17న గోలి, 19న మిట్టగుడిపాడు, 21న రెంటచింతల, 24న రెంటాల, 26న మంచికల్లు, 28న ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు పాలువాయి, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పాలువాయిగేటులో, 31న తుమ్మకోట గ్రామంలో ఈ రెవెన్యూ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మాచవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 6 నుంచి 28వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు క్షమారాణి తెలిపారు. 6న శ్రీరుక్మిణీపురం, 10న పిల్లుట్ల, 12న మల్లవోలు, 17న పిన్నెల్లి, 19న ఆకురాజుపల్లి, కొత్తపాలెం, తురకపాలెం, 21న మోర్జంపాడు, 24న వేమవరం, 27న చెన్నాయపాలెం, 28న మాచవరం, గంగిరెడ్డిపాలెం గ్రామ సచివాలయాల్లో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. కావున ఈ సదస్సులలో రైతులు దరఖాస్తు చేసుకుంటే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని, ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సీపీఐ పార్టీ పట్టణ కార్యదర్శి కృష్ణనాయక్



పిడుగురాళ్ల: ప్రభుత్వం వెంటనే నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి జె.కృష్ణనాయక్ అన్నారు. పట్టణంలోని శ్రీనివాస్ కాలనీలో ప్రజలకు ఇళ్ల స్థలాల కరపత్రాల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు స్థలం కేటాయించాలని ఆయన సూచించారు. అనంతరం ఇళ్లు కట్టుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మహిళా సమాఖ్య పి.సుజాత, రాగి కృష్ణమ్మ, జక్కా పిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు సామగ్రి అందజేత

మాచర్ల: పట్టణంలోని స్వర్గీయ మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ అబ్దుల్‌కలాం పేరుతో పోలియో సోకిన వారికి తక్కువ బరువు ఉన్న రాజస్థాన్ షూస్, మూడు చక్రాల వాహనాలు అందజేయడం జరుగుతుందని అబ్దుల్‌కలాం సేవా సమితి అధ్యక్షుడు షేక్ పాషావలి బుధవారం తెలిపారు. గురువారం పట్టణంలో బీఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరవుతారని, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, పలువురు నేతలు హాజరై దివ్యాంగులకు అవసరమైన సామగ్రి అందజేయడం జరుగుతుందన్నారు. దివ్యాంగులకు సహాయం అందజేస్తున్న దాతలు పోలిశెట్టి పిచ్చయ్య, ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు, కరస్పాండెంట్ పఠాన్ నాగూర్‌వలి, వెంకట నారాయణ, గోలి శ్రీనివాసరావు హాజరవుతారని వెల్లడించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాషావలి కోరారు.

అర్జీలు తీసుకోరు.. సమస్యలు పరిష్కరించరు

- సచివాలయ సేవలు నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వం
- సిబ్బందికి ఇతర బాధ్యతలు అప్పగిస్తున్న వైనం
- పనులు కాక ఇబ్బంది పడుతున్న ప్రజలు



సిబ్బంది లేక ఖాళీగా ఉన్న దాచేపల్లిలోని సచివాలయం

దాచేపల్లి: ప్రజల చెంతకే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెచ్చిన పాలనకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలుకుతోంది. ప్రజల ఆశలు..ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసిన గత ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రజలకు అందాల్సిన పౌర సేవలు అందకుండా పోతున్నాయి. గత ప్రభుత్వంలో 540కి పైగా సేవలను సచివాలయ వ్యవస్థ ద్వారా నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చి ప్రజల మన్ననలు పొందారు. కానీ నేడు సచివాలయ సిబ్బందిని ఇతర సేవల కోసం వినియోగిస్తున్న కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థపై శీతకన్ను వేసింది.

నిలిచిపోయిన సేవలు

సచివాలయాల ద్వారా ప్రజలకు అందించాల్సిన సేవలు దాదాపు నిలిచిపోయాయి. ప్రభుత్వం నుంచి వస్తున్న ఒత్తిళ్లను సచివాలయ సిబ్బంది తట్టుకోలేకపోతున్నారు. గత ప్రభుత్వం కంటే మెరుగైన సేవలు అందిస్తాం.. సంపద సృష్టిస్తాం.. అర్హులకు సంక్షేమ పథకాలు ఇస్తామని ఊదరగొట్టిన కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవస్థలను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థని పూర్తిగా పక్కన పెట్టిన కూటమి ప్రభుత్వం తాజాగా సచివాలయం ద్వారా అందించే సేవలను సైతం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రజలు భావిస్తున్నారు.

మానసిక ఒత్తిడిలో సిబ్బంది

ప్రభుత్వం ఇస్తున్న సర్వేలతో సచివాలయ సిబ్బంది సతమతం అవుతున్నారు. గత ప్రభుత్వంలో సచివాలయంలో ఉండి ప్రజలకు సేవలు అందించారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సచివాలయ సిబ్బందికి ఇతర విధులను కూడా అప్పగించి పని భారం పెంచుతోంది. ప్రస్తుతం సచివాలయాల్లో దాదాపుగా అన్ని సేవలను పక్కన పెట్టేశారు. సచివాలయ సిబ్బందితో పలు రకాల సర్వేలను చేయిస్తుంది. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ సర్వే, ఎంఎస్ఎంఈ సర్వేలను పూర్తి చేశారు. తాజాగా మరో సర్వే చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ సర్వేలు రోజుల తరబడి జరుగుతుండటంతో సిబ్బంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన సర్వేలను సకాలంలో చేయకపోతే షోకాజ్ నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

నాడు గ్రామ స్థాయిలోనే అన్నీ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామ, వార్డు సచివాలయాల్లోనే ప్రజలకు సేవలు అందేవి. ప్రస్తుత ప్రభుత్వంలో సచివాలయాలు అలంకారప్రాయంగా నిలుస్తున్నాయి. గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా గ్రామ స్థాయిలోనే సచివాలయాల ద్వారా ప్రజలకు అందేవి. కానీ నేడు సచివాలయ వ్యవస్థని పట్టించుకోకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బందికి ఇతర పనులు అప్పగించటంతో వారు సచివాలయాల వైపు రావటం లేదు. సమస్యల పరిష్కారం కోసం సచివాలయంలో అర్జీలు ఇచ్చినా తీసుకునే వారు గానీ పట్టించుకునే పరిస్థితి గానీ లేదు. దీంతో ప్రజలు కూడా సచివాలయాలకు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు.

సచివాలయంలోనే సర్టిఫికెట్‌లు అందేవి



సచివాలయ వ్యవస్థ అందుబాటులో ఉండటం వలన గత ఐదేళ్లు ప్రజలు సంతోషంగా ఉన్నారు. ఏ సర్టిఫికెట్ కావాలన్నా.. ఏ పథకం కావాలన్నా సచివాలయంలోనే మంజూరు చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ వ్యవస్థని పట్టించుకోవటం లేదు. సచివాలయ సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగించటం వలన వారు అందుబాటులో ఉండటం లేదు. సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు వస్తే తీసుకునే పరిస్థితి లేదు.

– ముత్యం చెన్నారెడ్డి, పెదగార్లపాడు

ప్రజలకు సేవలు అందించాలి




సచివాలయం వ్యవస్థని నిర్లక్ష్యం చేస్తే గ్రామ స్వరాజ్యం దెబ్బ తింటుంది. గతంలో సచివాలయం ద్వారా ఏ విధంగా సేవలు అందిస్తున్నారో ఇప్పుడు అదే విధంగా సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలి. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో మహోన్నతమైన లక్ష్యంతో ఈ వ్యవస్థని అందుబాటులోకి తెచ్చారు. ఇది ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది.

– షేక్ ఆదాంసాహెబ్, గామాలపాడు

సత్రశాల దేవస్థానం ఆదాయం రూ.85,600

సత్రశాల(రెంటచింతల): కార్తిక మాసం సందర్భంగా మండలంలోని సత్రశాల వద్ద వేంచేసి ఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానానికి రూ.85,600 ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్స్ ఈఓ గాదె రామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 నవంబర్ 2వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు భక్తులు చేపట్టిన అభిషేకాలు 389, దర్శనాలు 4,325, శీఘ్ర దర్శనాలు 61 ద్వారా మొత్తం రూ.85,600 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అన్నాభిషేకం



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసియున్న నాగుల గుడి దేవస్థానంలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాల సందర్భంగా బుధవారం 210 కిలోల అన్నంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఉత్సవాలలో ప్రజలకు అన్నదానం



కారెంపూడి: మండలంలోని వివిధ ఆర్యవైశ్య సంఘ శాఖల ఆధ్వర్యంలో బుధవారం పల్నాటి ఉత్సవాలకు వచ్చిన 3 వేల మంది ప్రజలకు అన్నదానం చేశారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే సయ్యద్ నశీర్ అహ్మద్, పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవలు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

మధ్యాహ్న భోజన పథకం బకాయిలను చెల్లించాలి

రెంటచింతల: మండలంలోని వివిధ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఇవ్వాల్సిన మూడు నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి తిక్కా నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా వారికి బిల్లులు రాకపోవడంతో నిర్వాహకులు అప్పులు చేసి మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న సమయంలో మధ్యాహ్న భోజన పథకానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. నిర్వాహకులకు కనీస వేతనం అమలు చేయాలని చాలీచాలని వేతనాల కారణంగా వారు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. ఒక్కో విద్యార్థికి ప్రస్తుతం ఇస్తున్న రూ.5.45ని రూ.10కి పెంచి నాణ్యమైన బియ్యం పంపిణీ చేసి విద్యార్థులకు పోషకాహారం అందజేయడానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



ఎంఈఓ అల్లి సురేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మాచర్ల: విద్యా శాఖ అధికారుల అనాలోచిత నిర్ణయాలను వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు బుధవారం సాయంత్రం మాచర్ల విద్యా శాఖ కార్యాలయం ముందు ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. యూటీఎఫ్ సంఘ మండల శాఖ అధ్యక్షుడు షేక్ నసీర్, ప్రధాన కార్యదర్శి నల్లపు ఆదినారాయణలు మాట్లాడుతూ ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టే అనాలోచిత నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరసన తెలియజేయడం జరుగుతుందన్నారు. ఎంఈఓ అల్లి సురేష్‌కుమార్‌కు సమస్య పరిష్కరించాలంటూ వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయుల బదిలీల నిర్ణయంపై ఉద్యమం మరింత ఉధృతం చేస్తామన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో యూటీఎఫ్ సంఘ నాయకులు ఎస్.వి.ఎస్.నాగరాజు, అయేషా, సుల్తాన్, అలిముస్తఫా, శ్రీనునాయక్, ఎస్.శాంతిబాయ్, యు.వెంకటేశ్వర్లు, అంజినాయక్, శంకర్ నాయక్, సత్యావతి, వి.రామారావు తదితరులు ఉన్నారు.

మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మిరప పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

మాచవరం: మిరప పంటల్లో అక్కడక్కడ జెమినీ వైరస్ (బొబ్బర తెగులు) ఆశిస్తుందని నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఓ కె.రామమ్మ తెలిపారు. మండలంలోని చెన్నాయపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వివిధ పంటల సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. రబీలో వరి పంట సాగు చేసే రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా లబ్ధి పొందేందుకు డిసెంబర్ 31లోగా ఎకరాకు రూ.630 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంగళరావు, పంచాయతీ కార్యదర్శులు రామ కోటేశ్వరరావు, నాగ మల్లేశ్వరరావు, వ్యవసాయ విస్తరణాధికారి వంశీ, సహాయకులు గోపి, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ఎవరి అండతో రేషన్ మాఫియా రెచ్చిపోతుంది

గురజాల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: రేషన్ మాఫియా అక్రమాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, చివరికి కార్డు దారులకు పంపిణీ చేయకముందే బియ్యాన్ని నల్లబజారుకు తరలించేస్తున్నారని గురజాల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలోఆయన మాట్లాడారు. కాకినాడ కేంద్రంగా సాగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాలో ఎవరెవరి పాత్ర ఉందనే సంగతి తెలిసినా కఠిన చర్యల్లేవు, కలెక్టర్, విజిలెన్స్, సివిల్ సప్లయిస్ ఉన్నతాధికారులు భారీ ఎత్తున రేషన్ బియ్యం దందా నడుస్తున్నా పట్టించుకోకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో రేషన్ మాఫియా రెచ్చిపోతుందని, కాకినాడ పోర్టులో తనిఖీలు చేసినట్లు అన్ని నియోజకవర్గాల్లోనూ తనిఖీలు చేపట్టి ఈ పేదల బియ్యం ఎవరికి ఆదాయ వనరుగా మారిందో గుర్తించాలని ఆయన తెలియజేశారు.

రోశయ్య సేవలు మరువలేనివి



రోశయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్మన్ పోలూరి, ఆర్యవైశ్య నాయకులు



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

మాచర్ల: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, ఆర్యవైశ్య సీనియర్ నాయకులు సూర్య యలమంద, ఖడ్గం సైదయ్య, బి.వెంకటేశ్వరరావులు అన్నారు. బుధవారం రోశయ్య వర్ధంతి పురస్కరించుకుని ఆయన కాంశ్య విగ్రహానికి పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో మంత్రి, ముఖ్యమంత్రిగా, ఇతర రాష్ట్రాల గవర్నర్‌గా ప్రజలకు పలు సేవలు అందించి, ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేసిన రోశయ్య ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. పలువురు నాయకులు రోశయ్యకు నివాళులర్పించారు.

మాచవరం: మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత కొణిజేటి రోశయ్య వర్ధంతిని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా, రాజకీయ నేతగా ఎన్నో పదవులు అలంకరించి, రాష్ట్రానికి ఎన్నో సేవలు అందించారని పలువురు వక్తలు కొనియాడారు. ఆర్యవైశ్యులకు ఆయన ఆదర్శనీయుడని అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

ఇద్దరు గొర్రెల దొంగల అరెస్టు

సత్తెనపల్లి: ఇరువురు గొర్రెల దొంగలను సత్తెనపల్లి రూరల్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సత్తెనపల్లి మండలం కందులవారిపాలెం గ్రామ పొలాల్లో మూడు గొర్రెలను మంగళవారం దొంగతనం చేసి ఆటో వద్దకు తీసుకు వెళుతున్న సమయంలో గొర్రెల యజమాని శ్రీకాంత్, మరికొందరు గమనించారు. సత్తెనపల్లికి చెందిన అన్నపురెడ్డి రవి, ఒంటిపులి మహేష్‌లు దొంగతనం చేశారని, వారిరువురిని తీసుకొచ్చి సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఇరువురి పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ అమినుద్దీన్ బుధవారం తెలిపారు. మరొకరు పరారీలో ఉన్నాడన్నారు.

న్యాయవాదులు విధులు బహిష్కరణ

సత్తెనపల్లి: న్యాయవాదిపై జరిగిన దాడికి నిరసనగా పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. అచ్చంపేట మండలం చిగురుపాడు గ్రామంలో మంగళవారం రాత్రి కొంత మంది వ్యక్తులు న్యాయవాది మెదర అనిల్‌కుమార్ కారును అడ్డగించి దాడి చేశారు. గాయాలపాలైన అనిల్‌కుమార్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ క్షతగాత్రుడు అనిల్‌కుమార్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవాది అనిల్‌కుమార్ పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సయ్యద్ అబ్దుల్ రహీమ్, గుజ్జర్లపూడి మార్క్‌రావు, సందెపోగు బాబురావు, చిన్నం మణిబాబు, జొన్నలగడ్డ విజయ్ కుమార్, న్యాయవాదుల గుమస్తాల సంఘం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంగులూరి సుబ్బారావు, సత్తెనపల్లి అధ్యక్షుడు మత్రి నరసింహారావు, కార్యదర్శి బలిజేపల్లి కోటి రత్నం, తదితరులు చికిత్స పొందుతున్న న్యాయవాది అనిల్‌కుమార్‌ను పరామర్శించారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తులు



వరి పంటను పరిశీలిస్తున్న డీపీఎం అమలకుమారి, కెనడా విద్యార్థిని జోహన్న విల్కిన్స్

ముప్పాళ్ల: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చని డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. మండలంలోని నార్నెపాడులోని ప్రకృతి వ్యవసాయ పంటలను కెనడా పీహెచ్‌డీ విద్యార్థిని జోహన్న విల్కిన్స్, రైతు సాధికారక సంస్థ అధికారి సౌమ్యలు బుధవారం సందర్శించారు. గ్రామానికి చెందిన మెంటార్ రజిని సాగుచేసిన వరి పంటను పరిశీలించారు. వరిలో పిలకలు అధికంగా దుబ్బులు బాగా మట్టిని పట్టి ఉండటాన్ని గమనించారు. వరిపంటలో 30 నుంచి 35 పిలకలు ఉన్నాయని, ఎటువంటి చీడపీడలు లేకుండా ఆరోగ్యరమంగా ఉందని తెలిపారు. అనంతరం నిరంతరం ఆదాయాన్ని ఇచ్చే ఏటీఎం మోడల్స్‌ను పరిశీలించి ఆదాయ వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. తరువాత గ్రామంలోని ప్రకృతి వ్యవసాయం చేసే మహిళా సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఉమ, ఎన్ఎఫ్ఏ నందకుమార్, మాస్టర్ ట్రైనర్ మధుబాబు, మెంటార్ రజిని, ఇన్‌చార్జ్ పూజ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఎంఎస్ఎంఈ సర్వే

నకరికల్లు: మండలంలో చేపడుతున్న ఎంఎస్ఎంఈ సర్వేతో చిరు, చిన్న, మధ్యతరహా వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం యోచిస్తుందని ఎంపీడీఓ జి.కాశయ్య అన్నారు. మండలంలోని నకరికల్లు, చల్లగుండ్ల గ్రామాల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారాల సర్వేను బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం సిబ్బందిచే ఎంఎస్ఎంఈ సర్వే చేపట్టి వ్యాపారులను స్థితిగతులను ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కె.వి.శివప్రసాద్, అబ్దుల్లా, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది వి.ఎస్.ప్రసాద్, షేక్.కరిముల్లా, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పల్నాడు విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న అవ్వారు సర్వేశ్వరరావు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నిర్మిస్తున్న పల్నాడు విజ్ఞాన కేంద్ర నిర్మాణానికి సెల్లార్ శ్లాబ్ పూర్తయి బిల్లులు చెల్లించాల్సి ఉండటంతో పట్టణంలోని కొత్తపేటకు చెందిన అవ్వారు సర్వేశ్వరరావు తాను వాగ్దానం చేసిన రూ. లక్షలో భాగంగా తొలి దఫాగా రూ. 70 వేలు బుధవారం ట్రస్ట్ చైర్మన్ గుంటూరు విజయకుమార్‌కు అందించారు. ఆయనకు పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కమిటీ తరఫున అభినందనలు తెలిపారు. అలాగే పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ ఏరియాకు చెందిన జి.ఆంజనేయులు పల్నాడు విజ్ఞాన కేంద్ర నిర్మాణ నిమిత్తం తాను వాగ్దానం చేసిన రూ. 50 వేల విరాళంలో చివరి భాగం రూ. 15 వేలు ట్రస్ట్ చైర్మన్ గుంటూరు విజయకుమార్‌కు అందించారు.ఆయా కార్యక్రమాలలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు గుంటూరు మల్లేశ్వరి, తదితరులు ఉన్నారు.

ముందస్తు గుర్తింపుతోనే బోదవ్యాధి నివారణ



పాపాయపాలెంలో రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

బెల్లంకొండ: ప్రాథమిక దశలో ముందస్తుగా గుర్తింపుతోనే బోదవ్యాధి నివారణ సాధ్యమవుతుందని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.వి.కోటేశ్వరరావు తెలిపారు. బోదవ్యాధి నివారణలో భాగంగా వ్యాధి వ్యాప్తిని గుర్తించేందుకు మండలంలో రెండు సబ్ సెంటర్‌లను ఎంపిక చేసి, శాంపిల్స్ సేకరిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని పాపాయపాలెం గ్రామంలో బుధవారం మాట్లాడుతూ ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు గ్రామంలో సాయంత్రం 6 గంటల నుండి 9 గంటల వరకు మూడు రోజులపాటు 100 మంది నుంచి రక్త నమూనాలను సేకరించినట్లు తెలిపారు. ఈ శాంపిల్స్‌ను పరీక్షించి బోద వ్యాధికారక క్రిమి రక్తంలో ఎంతశాతం వ్యాధి వ్యాప్తిని చేస్తుందో గుర్తించనున్నట్లు తెలిపారు. తద్వారా వ్యాధి నివారణకు చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 5వ తేదీ నుంచి మూడు రోజులపాటు చంద్రాజుపాలెం గ్రామంలో 300 రక్త శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు.హెల్త్ సూపర్‌వైజర్ బాషా, ఏఎన్ఎం రాధా, హెల్త్ అసిస్టెంట్ శంకర్ రెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య నాయకులకు సత్కారం



సత్తెనపల్లి: నూతంగా ఎన్నికైన ఆర్యవైశ్య చలివేంద్ర సంఘ అధ్యక్షుడు బచ్చు కొండలు, గో సంరక్షణశాల అధ్యక్షుడు పెండ్యాల కాశీ మల్లేశ్వరరావులను పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన మండపంలో ఆర్యవైశ్య యువజన సంఘ అధ్యక్షుడు చిల్లంచర్ల కళ్యాణ్ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘ సభ్యులు బచ్చు మురళి, జవ్వాజి రవి కుమార్, వనమా రాజేష్, దేసు రాజా, వాసు, లఘువరపు రమేష్, కటకం చంద్ర, భవిరిశెట్టి సాయి, యక్కల సతీష్ ఉన్నారు.